
సాక్షి బాపట్ల

మంగళవారం । 3 । జూన్ । 2025



గుట్టలు తొలగించేది ఎప్పుడో!

తెనాలి అర్బన్: పట్టణంలోని తూర్పు కాల్వలో వ్యర్థాలను తొలగించి రోడ్డు పక్కనే పడేశారు. పది రోజులు దాటుతున్నా తొలగించకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 512.20 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 5,292 క్యూసెక్కులు విడుదలవుతోంది.



శివాలయానికి బారికేడ్లు విరాళం

పెదకాకాని: పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం ఇర్లపాడుకి చెందిన ఆరుమళ్ల వెంకటరావు, అనూష దంపతులు 25 బారికేడ్లను శివాలయానికి సోమవారం అందజేశారు.

న్యూస్‌రీల్

6న ఐటీఐ అభ్యర్థులకు కౌన్సెలింగ్

మాచర్ల: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో 2024–25 సంవత్సరానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు మాచర్లలోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో కౌన్సెలింగ్ జరుగుతుందని జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు సోమవారం తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి మార్కు లిస్టు, స్టడీ సర్టిఫికెట్ ఒరిజినల్స్‌తో హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు మాచర్ల ఐటీఐ కాలేజీలో సంప్రదించాలన్నారు.

నేడు లక్ష్మీ వినాయకస్వామి ఆలయ వార్షికోత్సవం



పాత పాలువాయి(రెంటచింతల): పాత పాలువాయి గ్రామంలోని శ్రీ లక్ష్మీ వినాయకస్వామి ఆలయ 31వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు గార్లపాటి శివప్రసాద్ సోమవారం తెలిపారు. వేకువజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు, గణపతి పూజ, పలు రకాల అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

ఘనంగా త్రిశక్తి పీఠం నాలుగో వార్షికోత్సవం



పెదకూరపాడు: పెదకూరపాడులోని మహాలక్ష్మీ మహా సరస్వతి సమేత శ్రీ వాసవీ మాత దేవస్థానం నాలుగో వార్షికోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆలయ శాశ్వత ధర్మకర్త పొట్టి నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో యజ్ఞ హోమాది కార్యక్రమాలు జరిగాయి. అమ్మవార్లను చందనంతో అలంకరించారు. సోమవారం రాత్రి భక్తులకు అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

బావిలో జారిపడి విద్యార్థి మృతి



నూజెండ్ల: పొలంలోని వ్యవసాయ బావిలో జారిపడి విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలోని తంగారాల గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పమిడి ఏడుకొండలు, నాగరాజ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు పవన్‌కుమార్ (21) బీటెక్ రెండో సంవత్సరం గుంటూరులో చదువుతున్నాడు. సెలవులకు ఇంటికి వచ్చిన ఏడుకొండలు తండ్రికి సాయంగా పొలం వెళ్లాడు. దాహం తీర్చుకోవటానికి బావిలో దిగాడు. ఆ క్రమంలో జారిపడటంతో బావి లోతుగా ఉండటంతో మునిగిపోయి ఉంటాడని బంధువులు భావిస్తున్నారు. బావి సుమారు 25 అడుగుల లోతు ఉంటుందని, ఆరు ఇంజన్ల సాయంతో నీరు తోడటంతో మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. చేతికి అంది వచ్చిన కొడుకు మృతి చెందటంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. సమాచారం అందుకున్న ఐనవోలు ఎస్‌ఐ ఎంవీ కృష్ణారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటికొచ్చి తల పగలకొట్టారు



నేను 20 ఏళ్లుగా తొట్టెంపూడిలో యానిమేటర్‌గా పని చేస్తున్నా. నేను ఎప్పుడు రాజకీయాలు చేయలేదు. నా కుటుంబ సభ్యులు కూడా వాటికి దూరంగా ఉంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నన్ను విధుల నుంచి తప్పుకోమన్నారు. నేను ఎందుకని అడిగాను? సమాధానం చెప్పలేదు. టీడీపీకి చెందిన జాలాది సురేష్‌బాబు, ఆయన భార్య వాణి, పద్మ మా ఇంటి కొచ్చి నా భర్త మునలయ్య, మా అమ్మ కమలమ్మలపై దాడి చేసి తల పగలకొట్టారు. నన్ను కిందపడేసి వారికిష్టమొచ్చినట్లు కొట్టారు. పైగా నా భర్తపై రేప్ కేసు పెట్టారు. పోలీసులు కూడా వారికే అనుకూలంగా వ్యవహరించారు.

–తమనం సునీత, తొట్టెంపూడి, చుండూరు మండలం

కలెక్టర్‌ను కలిసినా ఫలితం శూన్యం



నేను పమిడిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలిగా 2008లో చేరా. ఇప్పటికి 16 సంవత్సరాలుగా పని చేస్తున్నా. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా నేను పని చేసుకుంటూనే ఉన్నా. పాఠశాలలు తెరిచిన తర్వాత యథావిధిగా వెళ్లా.

జూన్ 16న హెచ్‌ఎం పట్టాభిరామిరెడ్డి తమకు రాజకీయ ఒత్తిళ్లు పెరిగాయని, విధులు నుంచి తొలగాలన్నారు. ఇదేమని అడిగితే సమాధానం చెప్పలేదు. జూన్ 21న నన్ను విధుల నుంచి తొలగించారు. అప్పటినుంచి ఎంఈవో, డీఈవోల వద్దకు తిరిగినా ప్రయోజనం లేదు. కలెక్టర్‌కు ఇప్పటికి మూడు సార్లు అర్జీలు ఇచ్చా. అయినా ఫలితం లేదు.

– బేతంశెట్టి కనకమ్మ, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు పమిడిపాడు కొరిశపాడు మండలం

నడి రోడ్డున పడ్డాం



వాస్తవంగా 2027 వరకు ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయడంతో మేమంతా జీవనోపాధి కోల్పోయి నడిరోడ్డున పడ్డాం. జిల్లాలో 294 మంది ఎండీయూ వాహనాల ఆపరేటర్లగా పని చేస్తున్నాం. గతంలో మాకు వాహనమిత్ర కింద అందించే రూ. 10 వేలతో బ్రేక్, ఇన్స్యూరెన్స్ చేయించుకునే వాళ్లం. ఈ ఏడాది జనవరిలో మా అకౌంట్ నుంచి ఇన్స్యూరెన్స్ కింద రూ. 8773 కట్ చేశారు. వాహనం బ్రేక్ చేయాలంటే మరలా రూ. 20 వేలు కట్టాలంటున్నారు. ప్రస్తుతం వాహనాలను ఏం చేసుకోవాలో మాకు అర్థం కావడం లేదు.

– గొరిపర్తి గోపి, ఎండీయూ యూనియన్ అధ్యక్షులు, రేపల్లె మండలం

మా పొట్టకొట్టడం సరికాదు



అప్పు చేసి మరీ వాహనాలను కొన్నాం. మమ్ములను విధుల నుంచి తొలగించి మా పొట్టపై కొట్టడం దారుణం. ఇప్పటికి మేము మొబైల్ వ్యాన్ ఆపరేటర్లుగా నాలుగున్నరేళ్ల పాటు సేవలు అందించాం. ఈ ఉద్యోగం భవిష్యత్‌లో బాగుంటుందని, ఇతర ప్రాంతాల నుంచి స్వగ్రామానికి వచ్చేశాం. ప్రతి నెలా మాకు రూ.21 వేల జీతం వచ్చేది. మమ్మల్ని ఇప్పుడు అర్ధంతరంగా తొలగించడంతో భయమేస్తోంది.

– పేర్లి రమేష్, యూనియన్ అధ్యక్షులు, వేటపాలెం మండలం

చిరుద్యోగులకు చంద్ర గ్రహణం

- కక్ష సాధింపులకు పాల్పడుతున్న కూటమి సర్కార్
- జిల్లాలో యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లకు ఉద్వాసన
- మధ్యాహ్న భోజన నిర్వాహకులు, శానిటేషన్ వర్కర్లను వదలని వైనం
- నెలల తరబడి జీతాలు చెల్లించకుండానే తొలగింపు
- ఎండీయూ వాహనాలు రద్దు
- వందల మంది ఆపరేటర్ల పొట్టపై కొట్టిన ప్రభుత్వం
- పాలకులు తీరుపై మండిపడుతున్న చిరుద్యోగులు



జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న చిరుద్యోగులు (ఫైల్)

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

బాపట్ల టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు చిరుద్యోగుల పొట్ట కొడుతోంది. ఒక్కొక్కరికీ ఉద్వాసన పలుకుతోంది. ఉద్యోగాలను ఊడబెరుకుతూ రోడ్డున పడేస్తోంది. అధికారంలోకి రాక మునుపు వలంటీర్లను కొనసాగిస్తామని, నెలకు రూ.10 వేల చొప్పున జీతం కూడా ఇస్తామని హామీ ఇచ్చింది. తీరా అధికారంలోకి వచ్చాక వారిని తొలగించింది. డ్వాక్రా సంఘాల యానిమేటర్లను మోసం చేసింది. పొదుపు సంఘాలు తన మానసపుత్రికలు అంటూ ఎన్నికల సమయంలో ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే పలువురిని తొలగించారు.వీరితో పాటు వందల సంఖ్యలో ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, శానిటేషన్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంటింటికీ రేషన్ సరఫరా చేసే ఎండీయూ ఆపరేటర్లు... ఇలా అన్ని రంగాలకు చెందిన చిరుద్యోగులను విధుల నుంచి తొలగించారు.

తొలగింపులు ఇలా..



జె.పంగులూరు మండలంలో– 21, యద్దనపూడి–10, మార్టూరు–14, అద్దంకి –8, పిట్టలవానిపాలెం–1, చెరుకుపల్లి –3, నగరం – 21, చుండూరు– 12 మంది చొప్పున జిల్లా వ్యాప్తంగా సుమారు 300 మంది యానిమేటర్లను విధుల నుంచి తొలగించి వారిస్థానంలో పచ్చనేతల భార్యలకు అవకాశం కల్పించారు.

- జిల్లాలోని 435 గ్రామ సచివాలయాల పరిధిలోని 5220 మంది వలంటీర్లను తొలగించారు.
- కేంద్రప్రభుత్వం సహకారంతో నిర్వహించే ఉపాధి హామి పథకంలోకి 459 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను నిర్దాక్షిణ్యంగా విధుల నుంచి తొలగించారు.
- గత ప్రభుత్వం ఆధ్వర్యంలో వైన్‌షాపుల్లో సేల్స్‌మెన్, సూపర్‌వైజర్లుగా జిల్లాలోని 117 వైన్‌షాపుల్లో 468 మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తే కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన వెంటనే వారిని తొలగించారు.
- పచ్చపార్టీ వారికి అవకాశాలు కల్పించేందుకు ఇంటింటికి తిరిగి వైద్యసేవలు అందించే 250 మంది ఆశా వర్కర్లను తొలగించారు.
- ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వాహకులు, హెల్పర్లుగా విధులు నిర్వహించే వారిలో సుమారు 1500 మందిని కుట్రపూరితంగా విధుల నుంచి తొలగించారు.
- 173 మంది విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లను తొలగించారు.
- ఇంటింటికీ రేషన్ అందించే ఎండీయూ వాహనాల ఆపరేటర్లు, హెల్పర్లను 600 మందికి పైగా విధుల నుంచి తొలగించారు.

పీజీఆర్ఎస్ అర్జీలకు సత్వర పరిష్కారం

అధికారులకు కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశం



అర్జీలు పరిశీలిస్తున్న కలెక్టర్

బాపట్ల: పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు కలెక్టర్‌ను కలసి సమస్యలపై వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో 142 అర్జీలు నమోదయ్యాయి. తన పరిధిలోని వాటికి కలెక్టర్ తక్షణమే పరిష్కార మార్గం చూపారు. కొన్నింటిని పరిశీలించాలని, మరికొన్నింటిని విచారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో నమోదైన ప్రతి అర్జీని క్షుణ్ణంగా చదివి, పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమస్య పరిష్కారమైతే అర్జీదారులకు లిఖిత పూర్వకంగా ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలని చెప్పారు. తెలుగు భాషలోనే వాటిని జారీ చేయాలని, పరిష్కారమైన వాటిని నిబంధన ప్రకారం ఫొటోలతో అప్లోడ్ చేయాలని తెలిపారు.

విద్యార్థులకు పోటీలు నిర్వహించాలి

యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించాలని కలెక్టర్ చెప్పారు. ఈనెల 7న క్విజ్, వక్తృత్వం తదితర 15 రకాల పోటీలు నిర్వహించాలని తెలిపారు. 9వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జిల్లా స్థాయిలో కళాశాల విద్యార్థులకు పోటీలు జరపాలని, విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపాలని సూచించారు. యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లాలో జయప్రదంగా నిర్వహించాలని ఆదేశించారు. క్షయ వ్యాధి నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ నెల రోజులు పాటు అవగాహన కార్యక్రమాలు జిల్లాలో ఉంటాయని వెల్లడించారు. అనుమానం ఉన్న వారంతా పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. అదే క్రమంలో మలేరియా నిర్మూలనపై కూడా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రస్తుతం కోవిడ్ కేసులు బాపట్ల జిల్లాలో నమోదు కాలేదని, అయినప్పటికీ ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డీఓ పి. గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టీబీ కేసులు గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలి

జిల్లాలో టీబీ కేసులు గుర్తించడంతోపాటు మరణాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీ కేసులపై వాల్‌పోస్టర్లను ఆయన సోమవారం ఆవిష్కరించారు. జిల్లాలో సోమవారం నుంచి టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రాం ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లాలో టీబీ కేసులు వేగవంతంగా గుర్తించి మరణాలను తగ్గించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని ఆయన వివరించారు. వృద్ధులు, పోషకాహార లోపం ఉన్నవారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, హెచ్‌ఐవీ బాధితులు, ధూమపానం, మద్యపానం చేసే వారికి స్క్రీనింగ్ నిర్వహించాలని సూచించారు. పౌష్టికాహారం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టరు విజయమ్మ, లెప్రసీ, క్షయ నివారణ అధికారి డాక్టర్ మహమ్మద్ సాదిక్ పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

లోక్‌అదాలత్‌లో అధిక కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల

రేపల్లె: లోక్ అదాలత్‌లో అధిక కేసులు పరిష్కారం అయ్యేలా పోలీసులు కృషి చేయాలని మండల న్యాయాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల కోరారు. జులై 5వ తేదీన జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారం కోసం సోమవారం స్థానిక కోర్టు హాలులో డివిజన్ పరిధిలోని పోలీసులు, న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించి కక్షిదారులకు సత్వర న్యాయం చేయాలన్న లక్ష్యంతో న్యాయశాఖ లోక్ అదాలత్‌తో పాటు ప్రతి నెలా జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తోందని వివరించారు. డివిజన్ పరిధిలో కేసులను గుర్తించి పరిష్కారం అయ్యేలా పని చేయాలని తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవిసాయి శ్రావణి, రేపల్లె రూరల్ సీఐ సురేష్ బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జీవీ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అభివృద్ధి సున్నా

- మాజీ డెప్యూటీ స్పీకర్, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి
- ప్రజా వ్యతిరేక విధానాలపై రేపు నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డెప్యూటీ స్పీకర్ కోన

బాపట్ల: కూటమి ప్రభుత్వంలో ఆర్భాటాలే తప్పా అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి విమర్శించారు. సోమవారం స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 4న ప్రభుత్వ వెన్నుపోటు కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ప్రదర్శన చేపట్టి తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో శాసనసభ్యుడిగా తాను చేసిన అభివృద్ధి తప్పా ఎక్కడా వీసమెత్తు అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. అనేక అబద్ధపు ప్రచారాలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని తెలిపారు. పెన్షన్ మాత్రమే అందిస్తూ సంక్షేమ పథకాల అమలు చేయడంలో పూర్తిస్థాయిలో వెనకబడి ఉందని తెలిపారు. సూర్యలంక బీచ్ అభివృద్ధి కోసం రూ. 97 కోట్లు మంజూరు చేశామని ప్రచార ఆర్భాటాలు చేస్తున్నారని, అక్కడ చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాల డీపీఆర్ తయారు చేసి బహిరంగపరచాలని కోన డిమాండ్ చేశారు. జిల్లా ప్రజలకు అత్యంత ఉపయోగపడే మెడికల్ కళాశాల నిర్మాణ పనులను ఆపేశారని, తక్షణమే ప్రారంభించి జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ నెల 4న నిర్వహించనున్న ప్రభుత్వ వెన్నుపోటు కార్యక్రమాలను పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని కోరారు.

పలువురు ఉపాధికి గండి

రాష్ట్రంలో ఉన్న 64లక్షల పెన్షన్లలో రెండు లక్షలు తొలగించి కూటమి ప్రభుత్వం వృద్ధులకు తీరం అన్యాయం చేసిందని విమర్శించారు. వలంటీర్లతో పాటు రేషన్ సరఫరా చేసే వాహనాలను సైతం తొలగించి ఎంతో మంది ఉపాధిని దెబ్బతీసిందని తెలిపారు. అధికారంలోకి వస్తే ఉపాధి కల్పన చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయలేదని విమర్శించారు. నేరుగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల ఖాతాలోకి నగదు జమ చేయడం వల్ల ఎంతో మంది ఆర్థిక పరిస్థితులు మెరుగు పడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, బాపట్ల ఏఎంసీ మాజీ చైర్మన్ డి. సీతారామిరెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి జయభారతరెడ్డి, నాయకులు చేజర్ల నారాయణరెడ్డి, జోగి రాజా, చల్లా రామయ్య, నర్రావుల వెంకట్రావు, బంగారు రెడ్డి, ఇమ్మడిశెట్టి అంకమ్మ, తన్నీరు అంకమ్మరావు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **1,400** గరిష్ఠం : రూ. **2,400**

మోడల్ ధర రూ. **1,800**

క్లుప్తంగా

స్పైసెస్ బోర్డు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

కొరిటెపాడు(గుంటూరు): ఎగుమతులు, విలువ జోడింపు – రైతు సాధికారతను పెంచడానికి 2025–26 ఆర్థిక సంవత్సరానికి స్పైసెస్డ్ పథకం కింద దరఖాస్తులను ఆహ్వానిస్తోందని స్పైసెస్ బోర్డు డీడీ ఆనంద్ దేవ్ వర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని స్పైసెస్ బోర్డు 2025–26 ఆర్థిక సంవత్సరానికి 'ఎగుమతి అభివృద్ధి కోసం ప్రగతిశీల, వినూత్న, సహకార జోక్యాల ద్వారా సుగంధ ద్రవ్యాల రంగంలో స్థిరత్వం' అనే ప్రధాన పథకం కింద ఆర్థిక సహాయాన్ని ప్రకటించిందన్నారు. స్థిరత్వం, ఆవిష్కరణ, ఎగుమతి అభివృద్ధిపై దృష్టి సారించడం ద్వారా భారతీయ సుగంధ ద్రవ్యాల రంగాన్ని బలోపేతం చేయడానికి ఈ పథకం రూపొందించబడిందని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పణ మే నెల 26వ తేదీ నుంచి ప్రారంభమైందని, సుగంధ ద్రవ్యాల ఎగుమతిదారుల కోసం స్పైస్డ్ పథకంలో భాగంగా ఎగుమతి అభివృద్ధి, ప్రమోషన్ భాగాల కింద దరఖాస్తును ఈ నెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వాటాదారులు www.indianspices.com ను సందర్శించి దరఖాస్తులను సమర్పించవచ్చని ఆయన వెల్లడించారు.

పోలీసుల తీరు హేయం



తెనాలిరూరల్: దళిత, మైనార్టీ యువకులపై జనావాసాలు మధ్య బహిరంగంగా, కర్కశంగా పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం హేయమైన చర్య అని ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శాంతకుమార్ అన్నారు. తెనాలిలో సోమవారం ఆయన మాట్లాడారు. ముగ్గురు బాధితులను అమానుషంగా హింసించడంపై ప్రజా హక్కులు సంఘాలు తీవ్రంగా ధ్వజమెత్తుతున్నాయన్నారు. పోలీసుల చర్యలను సమర్థిస్తూ బాధిత యువకులపై ఎలాంటి గాయాలు లేవని తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించిన డాక్టర్లతో పాటు సాక్షులుగా ఉన్న వీఆర్వోలను కూడా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తెనాలి బార్ అసోసియేషన్ బేతాళ ప్రభాకర్, దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది కొరివి వినయ్ కుమార్, తెనాలి జేఏసీ అధ్యక్షుడు బొనిగల ప్రదీప్, తెనాలి నియోజకవర్గం ఇన్‌చార్జి కారుమంచి సునీల్ సందీప్, న్యాయవాదులు గుంటి సురేష్ బాబు, గుమ్మడి రవిరాజు, కంచర్ల కోటేశ్వరరావు, కనపర్తి కుటుంబరావు, పెనుమాక మధు, దోమ రమేష్ రాంజి తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులతో సహృదయంతో వ్యవహరించాలి

ఎస్పీ తుషార్ డూడీ


ఎస్పీకి సమస్య వివరిస్తున్న బాధితులు

బాపట్ల టౌన్: అర్జీదారులతో సహృదయంతో వ్యవహరించాలని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ అర్జీలు పునరావృతం కాకుండా చట్టపరిధిలో సంతృప్తికర రీతిలో పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. అర్జీదారులతో సహృదయ భావనతో వ్యవహరించినప్పుడే సమస్య, వారు పడే ఆవేదన అర్థం అవుతుందని చెప్పారు.అప్పుడే వేగంగా స్పందించి వారి సమస్యలు పరిష్కరించగలమని చెప్పారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. జిల్లా నలుమూలల నుంచి 44 మంది బాధితులు ఎస్పీకి తమ సమస్యలను తెలియజేశారు. కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్, పీజీఆర్ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెన్నుపోటుకు పేటెంట్ చంద్రబాబుదే !


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అంబటి రాంబాబు, పోతిన మహేష్, బలసాని కిరణ్‌కుమార్, అంబటి మురళీకృష్ణ, నూరి ఫాతిమా తదితరులు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- ఏటుకూరులో వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు రూరల్: వెన్నుపోటు పొడవటంలో చంద్రబాబు సిద్ధహస్తుడని, ఈవిషయంలో పేటెంట్ ఆయనదేనని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. సోమవారం మండలంలోని ఏటుకూరు బైపాస్ నందున్న వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యాలయంలో ఈనెల 4వ తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమంపై కార్యకర్తలకు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అంబటి రాంబాబు మాట్లాడుతూ చంద్రబాబు తనకు పిల్లను ఇచ్చిన మామనే వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కున్నాడన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తా.. ఆదాయాన్ని సృష్టిస్తా అని అబద్ధాలు చెప్పి గద్దెనెక్కి నేడు రాష్ట్రంలోని ప్రజలకు పథకాలు అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచాడని విమర్శించారు.

సంపద సృష్టి పేరుతో పేదల కష్టం దోపిడీ

వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పోతిన మహేష్ మాట్లాడుతూ చంద్రబాబు సంపద సృష్టిస్తానని చెప్పి విద్యుత్ చార్జీలను పెంచి పేదలు, రైతులను వెన్నుపోటు పొడిచాడన్నారు. సంపద సృష్టి పేరుతో గ్రామాల్లో వీధికి నాలుగు బెల్ట్ షాపులను నిర్వహిస్తూ మద్యాన్ని ఏరులా పారించి పేదల కష్టాన్ని దోచుకుంటున్నాడన్నారు. పార్టీ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుకు పేదలు సంతోషంగా ఉంటే నచ్చదని, వారిని అణగదొక్కేందుకు ఎల్లపుడూ చూస్తుంటాడన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా నేటికి ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేకపోయారన్నారు. దానికి తోడు నిత్యం వేల కోట్ల అప్పులు చేసి నేటికి ఆంధ్ర రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చాడన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 4న ఉదయం 10 గంటల నుంచి వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని పాత మల్లాయపాలెంలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పించి అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేస్తామన్నారు. పొన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ అంబటి మురళీకృష్ణ, నగర అధ్యక్షురాలు, ఈస్ట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నూరి ఫాతిమా, మంగళగిరి ఇన్‌చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి, నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు

- ఓవరాల్ చాంప్ ఎన్టీఆర్‌జిల్లా
- రన్నర్స్‌గా కర్నూలుజిల్లా


ఓవరాల్ చాంపియన్‌గా కప్పు అందుకుంటున్న ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారులు


రన్నరప్‌గా నిలిచిన కర్నూలుజిల్లా క్రీడాకారులు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ జిల్లాల 11వ సీనియర్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్– 2025 పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. రన్నర్స్ స్థానంలో కర్నూలు జిల్లా నిలిచింది. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో పురుషుల వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ను ఎం.శరత్ (ఎన్టీఆర్ జిల్లా) సాధించగా, మహిళల విభాగంలో సన్వి కొంగర, యు.ప్రేమాంమృత (ఎన్టీఆర్‌జిల్లా) సంయుక్తంగా వ్యక్తిగత చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కొంగర రవికాంత్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించిన పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. పోటీలలో భాగంగా ఎంపిక చేసిన రాష్ట్ర స్విమ్మింగ్ జట్టు క్రీడాకారులు త్వరలో ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరగనున్న 78వ సీనియర్ నేషనల్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఓబుల్‌రెడ్డి, వెంకట్ రామ్మోహన్, పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఏ.ఏ.రామలింగారెడ్డి, వై.వి.సుబ్బారెడ్డి, కోశాధికారి శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా..ఐదుగురికి గాయాలు


ప్రమాదానికి గురైన కారు


బాధితులను హైవే అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలిస్తున్న సిబ్బంది

అరుణాచలం వెళ్తుండగా ఘటన

ఉలవపాడు: ప్రమాదవశాత్తు కారు అదుపుతప్పి బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై రాజుపాలెం జంక్షన్ వద్ద సోమవారం ఈ సంఘటన జరిగింది. వివరాలు... గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన సీహెచ్.బాలభాస్కర్ కుటుంబ సభ్యులు, బంధువులు కలసి ఏడుగురు కారులో అరుణాచలానికి బయలుదేరారు. అందరూ మాట్లాడుకుంటూ సంతోషంగా వెళుతున్న సమయంలో రాజుపాలెం జంక్షన్ వద్దకు వచ్చేసరికి కారు అదుపు తప్పి బోల్తా పడింది. కారులో ఉన్న వారిలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఏ.విజయలక్ష్మి, లక్ష్మీవాణి, కామాక్షి, బాలభాస్కర్, సీతారావమ్మలకు గాయాలు కాగా వీరిని హైవే అంబులెన్స్ సిబ్బంది ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు. రోడ్ సేఫ్టీ సిబ్బంది బాధితులను హైవే అంబులెన్స్ లో ఎక్కించి పంపించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమానుష దాడిపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు

బాధితులను న్యాయం జరగాలని కుటుంబ సభ్యుల డిమాండ్

పట్నంబజారు: తెనాలి పోలీసుల అమానుష దాడికి గురైన బాధితులు జాన్ విక్టర్ తండ్రి ఇజ్రాయిల్, రిమాండ్‌లో ఉన్న మరో బాధితుడు దోమ రాకేష్ తల్లిదండ్రులు సోమవారం గుంటూరులోని ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ) కార్యాలయంలో రాష్ట్ర కన్వీనర్ రాయపూడి మాణిక్యారావును కలిశారు. వారిపై జరిగిన దాడిని వివరించారు. ఐఎల్‌పీఏ తరపున బాధితుల పక్షాన కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. బాధితులపై జరిగిన దాడిని గుంటూరు ఇన్‌చార్జి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రాయపూడి మాణిక్యారావు మాట్లాడుతూ ఘటనను చట్టపరంగా విచారించి, పోలీసులు రాకుండా దీనిపై జ్యుడీషియల్ విచారణ చేయించాలని కోరారు. పోలీసుల నుంచి బాధితులకు రక్షణ కల్పించాలని కోరారు. న్యాయవాదిపై దుర్భాషలాడుతూ చేసిన దాడిని ఇన్‌చార్జి కలెక్టర్‌కు వివరించారు. స్పందించిన ఇన్‌చార్జి కలెక్టర్ విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ గంగా వెంకటేశ్వర్లు

లక్ష్మీపురం: వ్యసనాలకు అలవాటు పడిన భర్తను వదిలి పుట్టింట్లో ఉంటూ పని చేసుకుంటూ పిల్లలను పోషించుకుంటున్న మహిళను ఆమె భర్త కత్తి పొడిచి గాయాలపాలు చేశాడు. నిందితుడిని పట్టాభిపురం పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. కోబాల్ట్‌పేటకు చెందిన మెరిగల రాజేష్, కల్పనకు 2014లో వివాహం అయింది. రాజేష్ పెయింటింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. అయితే, కొంతకాలంగా రాజేష్ వ్యసనాలకు అలవాటు పడి మద్యం తాగుతూ భార్యను వేధించడం ప్రారంభించాడు. దీంతో భర్త వేధింపులు తట్టుకోలేక కల్పన ఏడాది క్రితం పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. పిల్లలను పోషించేందుకు చంద్రమౌళీనగర్‌లోని సంస్థలో చిరు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. అయితే రాజేష్ మద్యం తాగి పిల్లలు కావాలంటూ, కాపురానికి రావాలంటూ భార్య పని చేసే ప్రదేశానికి వెళ్లి వేధిస్తుంటాడు. ఈ నేపథ్యంలో గత నెల 25న రాత్రి ఆమె పనిచేసే ప్రదేశానికి వెళ్లి వాగ్వివాదానికి దిగిన రాజేష్ వెంట తెచ్చుకున్న కత్తితో పొడిచి తీవ్ర గాయాలపాలు చేశాడు. దీన్ని గమనించిన స్థానికులు కల్పనను హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న పట్టాభిపురం పోలీసులు ఘటన జరిగిన ప్రదేశంలో విచారించి, బాధితురాలు కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడు ఉడాయించడంతో అతనికోసం గాలింపు చేపట్టారు. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్ఐ తరంగిణిలకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి కోబాల్ట్‌పేట 7వ లైన్‌లో నిందితుడు ఉన్నట్లు తెలియడంతో మెరిగల రాజేష్‌ను అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించి సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సుద్దపల్లిలో వ్యక్తి దారుణహత్య

వివాహేతర సంబంధమే కారణం


మృతుడు కొమ్మూరి గోపయ్య(ఫైల్)


సుద్దపల్లిలో కొమ్మూరి గోపయ్య హత్యపై వివారిస్తున్న ఎస్ డి.వెంకటకృష్ణ

చేబ్రోలు: వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి దారుణహత్యకు గురైన సంఘటన సోమవారం సుద్దపల్లిలో చోటు చేసుకుంది. చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన కొమ్మూరి గోపయ్య(35)ను గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి హతమార్చారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న చేబ్రోలు సీఐ వై.కోటేశ్వరరావు, ఎస్ఐ డి.వెంకటకృష్ణలు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. మృతుడి తల్లి కొమ్మూరి రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.వెంకటకృష్ణ తెలిపారు. మహిళకు ఇద్దరు వ్యక్తులతో ఉన్న వివాహేతర సంబంధం నేపథ్యంలో చోటు చేసుకున్న వివాదం కారణంగానే ఈ హత్య జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

వేటపాలెం: గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. స్థానిక రామన్నపేట శివారులోగల కనక నాగవరపమ్మ దేవస్థానం సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైందన్నారు. మృతురాలికి సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయస్సు ఉంటుందని భావిస్తున్నారు. మహిళ మృతి చెంది చాలా రోజులై ఉంటుందని తెలిపారు. మృతదేహం బాగా పాడైపోయి ఉందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జెడ్పీలో ఉద్యోగుల బదిలీలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ పరిధిలో 91 మంది ఉద్యోగులు వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయ్యారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో సీఈఓ వి.జ్యోతిబసు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా బదిలీలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సీఈఓ జ్యోతిబసు మాట్లాడుతూ ఒక చోట ఐదేళ్లు విధులు నిర్వహించిన వారిని ఇతర ప్రాంతాలకు తప్పనిసరిగా బదిలీ చేస్తున్నామని చెప్పారు. ఏడుగురు పరిపాలనాధికారులతో పాటు ఎనిమిది మంది సీనియర్ అసిస్టెంట్లు, 17 మంది జూనియర్ అసిస్టెంట్లు, తొమ్మిది మంది టైపిస్టులు, ఇద్దరు ల్యాబ్ అసిస్టెంట్లు, 39 మంది ఆఫీస్ సబార్డినేట్లు, ఒక నైట్ వాచ్‌మెన్ బదిలీ అయినట్లు చెప్పారు.

ఆత్మరక్షణ కోసం ఆయుధం

- కర్రసాము, తైక్వాండోల్లో రాణిస్తున్న చిన్నారులు
- అంతర్జాతీయ పోటీల్లో పతకాల పంట
- మారుతున్న తల్లిదండ్రుల ఆలోచన ధోరణి


చిన్నారులకు శిక్షణనిస్తున్న కోచ్ కాశీనాథ్ రెడ్డి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ప్రతి చిన్న సమస్యని పెద్దదిగా చూడడం, ఆందోళన చెందడం, క్రమశిక్షణ లోపించడం తదితర అంశాలను నేటిచిన్నారుల్లో తరచూ చూస్తుంటాం. తల్లిదండ్రుల్లో కూడా తమ పిల్లల చదువుకు అధిక ప్రాధాన్యతనిచ్చి పెద్ద కళాశాలల్లో సీట్లు సాధించాలనే తపన ఎక్కువగా కనిపిస్తుంది. అయితే, కొందరు మాత్రం విద్యావంతులుగానూ ఆత్మ రక్షణ విద్యలోనూ మేటిగానూ చూడాలనుకుంటున్నారు. దీనికి తగ్గట్లుగా శిక్షణా శిబిరాల్లో చేర్పించి దీటుగా తీర్చిదిద్దుతున్నారు. ఇలా శిక్షణ పొందిన కొందరు చిన్నారులు పోటీల్లోనూ రాణిస్తున్నారు. గుంటూరు విద్యానగర్‌లోని కాశీనాథ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో సుమారు 100 మందికిపైగా మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతూ అద్భుతంగా రాణిస్తున్నారు. గత నెల 24 నుంచి 26 వరకు తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జరిగిన 5వ అంతర్జాతీయ కర్రసాము పోటీల్లో 9 బంగారు, 5 రజతాలు 3 కాంస్య పతకాలు సాధించి ఔరా అనిపించారు. అకాడమీ కోచ్ కాశీనాథ్ రెడ్డి ప్రత్యేక శిక్షణలో రాటుదేలుతున్న వీరు కర్రసాముతో పాటు తైక్వాండాలోనూ విశేషంగా రాణిస్తున్నారు.

ఆర్మీలో చేరతా !



అంతర్జాతీయ కర్రసాము పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించాను. తైక్వాండాలో 2వ డాన్ బ్లాక్ బెల్ట్. నేషనల్ మెడల్స్ కూడా ఉన్నాయి. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే సాధన చేస్తున్నా. నిత్యం ఫిట్‌గా ఉండడంతో ఒత్తిడి ఉండదు. గత ఐదు సంవత్సరాలుగా సాధన చేస్తున్నా. ఆర్మీలోగానీ, పోలీస్ శాఖలోగానీ చేరతాను.

– బి.హర్షవర్ధిని, 10వ తరగతి

ఫిట్‌గా ఉంటా !



నాకు అలసట ఉండదు. ఎన్ని గంటలైనా క్లాస్‌లో బోర్ కొట్టకుండా కూర్చుంటాను. కర్రసాము, తైక్వాండో సాధన కారణంగా ఆ శక్తి నాలో ఉంటుంది. 2వ డాన్ బ్లాక్‌బెల్ట్‌తోపాటు కర్రసాములోనూ పతకాలు సాధించా . పోలీస్ ఉద్యోగమంటే చాలా ఇష్టం.

– డి.శ్రవంత్ కుమార్, 10వ తరగతి

తెలియని ధైర్యం



మార్షల్ ఆర్ట్స్ సాధనతో తెలియని ధైర్యం ఉంటుంది. కోచ్ శిక్షణతోపాటు మెడిటేషన్, ఎథిక్స్ గురించి చెబుతుంటారు. ప్రతి రోజూ క్రమం తప్పకుండా సాధన చేస్తాను. అంతర్జాతీయ పోటీల్లో బంగారు, కాంస్య పతకాలు వచ్చాయి. తైక్వాండోలో 2వ డాన్ సాధించాను. అమ్మ నాన్న కూడా బాగా ప్రోత్సహిస్తారు. ఆర్మీలో చేరి, దేశ సేవ చేస్తాను.

– వి.హంసిని మీనాక్షి, 10వ తరగతి

పతకాలు ఆత్మస్థైర్యాన్ని పెంచాయి



ఇటీవల ముగిసిన అంతర్జాతీయ కర్రసాము పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించాను. ఆ విజయం నాలో ఆత్మస్థైర్యాన్ని పెంచింది. తైక్వాండాలోనూ జాతీయస్థాయిలో కాంస్య పతకం సాధించాను. 2వ డాన్ బ్లాక్ బెల్ట్ ఉంది. నిత్యం సాధన కొనసాగిస్తుంటా . మరిన్ని పోటీలకు సిద్ధపడుతున్నా.

– బి.రమ్యశ్రీ రెడ్డి, 7వ తరగతి

తల్లిదండ్రుల్లో మార్పు వచ్చింది



నేను 20 ఏళ్ల నుంచి తైక్వాండో, 8 సంవత్సరాల నుంచి కర్రసాము నేర్పిస్తున్నాను. ప్రస్తుతం 100 మంది పిల్లలు న్నారు. ఈ మధ్య తల్లిదండ్రుల ఆలోచనల్లో చాలా మార్పు వచ్చింది. తమ పిల్లలను క్రీడా, ఆత్మరక్షణ శిక్షణకు తీసుకువస్తున్నారు. అదే విధంగా రిజల్ట్ కూడా ఉంటుంది. మా అకాడమీ పిల్లలు సాధనతోపాటు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లోనూ ప్రతిభ కనబరుస్తున్నారు.

– బి.కాశీనాథ్ రెడ్డి, చీఫ్ కోచ్, గుంటూరు